సాక్షి సంగారెడ్డి

సోమవారం । 4 । నవంబర్ । 2024



బండరాయితో మోది..

గుర్తు తెలియని యువకుడిని బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు 8లో ▸



సినిమాకు వెళ్లొచ్చేసరికి..

ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లి ఇంటికొచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు 8లో ▸

హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 5న హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సౌందర్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్‌- 14, 17 బాల బాలికలకు హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. రాణించిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

కేతకీలో అభివృద్ధి పనులు



ఆలయం ఎదుట కొనసాగుతున్న పనులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయం ముందు ఉన్న రాజగోపురం ఆవరణలో షెడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో షెడ్డు లేకపోవడంతో మహా శివరాత్రి నుంచి వేసవి ముగిసే వరకు తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసేవారు. వర్షాకాలంలో ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడేవారు. దాతల సహాయంతో ముందు భాగంలో రూ. 28 లక్షలు, ఆలయ ప్రాంగణంలో రూ.5 లక్షల వ్యయంతో షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఈఓ శశిధర్ వెల్లడించారు.

కరుణించు.. కరుణామయా



చర్చిలో భక్తుల సందడి

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 3 గంటల వరకు రెండు దఫాలుగా భక్తులు ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు



సంగారెడ్డి టౌన్: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు సంగారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీన బస్సు సంగారెడ్డి నుంచి అరుణాచలం బయలుదేరుతుందన్నారు. ఏపీలోని కాణిపాకం విఘ్నేశ్వర, వేలూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుందన్నారు. ఈనెల 16వ తేదీన తిరిగి బస్సు సంగారెడ్డికి చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి టూర్ ప్యాకేజీ రూ. 4,300 ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959226267, 9849439945 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు మంత్రుల పర్యటన

కౌడిపల్లి(నర్సాపూర్)/నర్సాపూర్: మండలంలోని మహమ్మద్‌నగర్ పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని సోమవారం మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం కానుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని తెలిపారు. మంత్రి దామోదర, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

వినియోగదారుడే మా దైవం



మాట్లాడుతున్న ఏఈడీ దుర్గాప్రసాద్

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుత్ సంస్థకు వినియోగదారుడే భగవంతుడని, వారికి సంతృప్తికరమైన సేవలు అందించినప్పుడే సంస్థకు మనుగడ ఉంటుందని గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు, వినియోగదారులతో సదస్సు నిర్వహించారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఏఈలు వెంకటేశ్వర్లు విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.

56 అంశాలు.. 75 ప్రశ్నలు



సంగారెడ్డిలో సర్వే ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి (ఫైల్). (ఇన్‌సెట్) సర్వే ఫాం నమూనా

కుటుంబ సర్వేకు సన్నద్ధం

- ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం
- ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం
- అధికారికంగా తేలనున్న జనాభా లెక్కలు

2011 జిల్లా జనాభా లెక్కల వివరాలు

మండలాలు	ఇళ్ల సంఖ్య	స్త్రీలు	పురుషులు	మొత్తం
28	3,29,520	7,51,033	7,77,870	15,28,903

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లా అధికారులు సన్నద్ధం అవుతున్నారు. జిల్లావ్యాప్తంగా అన్నివర్గాల ప్రజల, ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే గ్రామాలు, వార్డుల వారీగా జాబితాను సిద్ధం చేసి ఇళ్ల సంఖ్యను గుర్తించారు. సర్వే నిర్వహణకు ఎన్యూమరేటర్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లను నియమించారు.

ఎన్యూమరేటర్లు- 3,364.. సూపర్‌వైజర్లు- 337

జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో సర్వే చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 150 నుంచి 175 ఇళ్లకు ఒక ఎన్యూమరేషన్ బ్లాక్ (ఈబీ)గా ఏర్పాటు చేసి, ప్రతి ఈబీకి ఒక నంబర్ ఇవ్వడంతో ఒక ఎన్యూమరేటర్‌ను నియమిస్తున్నారు. 10 ఈబీలను ఎన్యూమరేటర్ల డాటా సేకరణ, పర్యవేక్షించటానికి ఒక సూపర్‌వైజర్‌ను నియమించనున్నారు. ఈ మేరకు 3,364 మంది ఎన్యూమరేటర్లు, 337 మంది సూపర్ వైజర్లను నియమించారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..

ఎన్యూమరేటర్లు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే చేయనున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రభుత్వం రెండు విభాగాలుగా సిద్ధం చేసింది. పార్ట్‌- 1, పార్ట్‌- 2 కలిపి 56 అంశాల్లో 75 ప్రశ్నల ఫాం ఉంటుంది. ఇందులో పార్ట్‌-1లో కుటుంబ యజమాని వివరాలతో పాటు కుటుంబ సభ్యుల పూర్తి సమాచారం, రాజకీయ వివరాలు సేకరించనున్నారు. పార్ట్‌- 2లో కుటుంబ సభ్యులకు ఉన్న అప్పులు, వివరాలు, ఏ అవసర నిమిత్తం, అప్పు వివరాలతో పాటు పశు సంపద, ఆస్తులు, తదితర వివరాలు సేకరించనున్నారు. ఒక్కో ఇంటికి సంబంధించిన కుటుంబ వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ విధంగా ఎన్యూమరేటర్ సేకరించిన వివరాలను సూపర్‌వైజర్‌కు అందిస్తారు. ఈ విధంగా సమగ్ర ఇంటింటి సర్వే కొనసాగనుంది. ఏ ఒక్క ఇల్లును వదలకుండా సర్వే చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు

రాష్ట్ర ప్రభుత్వం ముందుగా సర్వే చేసేందుకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో పాటు ఇతర శాఖల సిబ్బందిని నియమించారు. ఇటీవల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వే చేసేందుకు నిర్ణయించింది. ఇప్పటికే మొదటగా నిర్ణయించిన వారికి సర్వే శిక్షణను పూర్తి చేశారు. కేటాయించిన ఉపాధ్యాయులకు రెండో విడతగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

13 ఏళ్ల తర్వాత జనగణన

2011లో ప్రభుత్వం జనగణన నిర్వహించింది. ఆతర్వాత పలు కారణాలతో జనగణన జరగలేదు. 13 ఏళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టింది. దీంతో అంచనాకే పరిమితం అయిన జనాభా లెక్క అధికారికంగా తేలనుంది. ప్రభుత్వం చేపట్టనున్న సర్వే ఏర్పాట్లను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఇటీవల పట్టణంలో పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలు తెలుసుకొని, పలు సూచనలు, సలహాలు అందించారు.

ప్రణాళికాబద్ధంగా సర్వే



ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేస్తాం. ఒక్క ఇంటిని కూడా వదలకుండా పకడ్బందీగా చేపడుతాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సమన్వయంతో ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేస్తాం. ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు పూర్తి వివరాలు అందించి భాగస్వాములు కావాలి.

– చంద్రశేఖర్, అదనపు కలెక్టర్, సంగారెడ్డి



గొల్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్మల

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

కొండాపూర్(సంగారెడ్డి): కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల అధికారులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కొండాపూర్, గొల్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నాలతో పాటు దొడ్డు ధాన్యం సైతం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యత పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, కొండాపూర్, గొల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్లు మాణిక్యరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సీఈఓ సిరాజ్, నాయకులు మాజీ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింలు, బలవంత్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎక్బాల్ పాష, కిషన్ నాయక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో గర్భిణుల నమోదు ప్రక్రియ వందశాతం ఉండాలని, పీహెచ్‌సీలో అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యులకు సూచించారు. ఆదివారం మనోహరాబాద్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు, వైద్యుల హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో పడకలు, గదులు, పరిశుభ్రత తదితర అంశాలను తిరిగి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సమయపాలన



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. 1 నుంచి 15 సంవత్సరాల విద్యార్థులను ఆర్‌బీఎస్‌కే టీం క్షుణంగా పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితిలపై నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.



అన్నదాత అరిగోస

కౌల్చారం(నర్సాపూర్): ఓ వైపు అకాల వర్షంతో ధాన్యం తడుస్తుండడం.. మరోవైపు తూకం వేసే పరిస్థితి కానరాకపోవడంతో రైతులు అరిగోస పడుతున్నారు. ధాన్యం విక్రయించేందుకు ఇంకెంతకాలం ఎదురు చూడాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల క్రితం పొలం నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చి రోజూ ఆరబెట్టడం, సాయంత్రం కుప్పలు చేయడం పరిపాటిగా మారిందని మండల రైతులు వాపోతున్నారు.



ఎంపీ రఘునందన్‌రావును సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

పటాన్‌చెరుకు ‘మెట్రో’ వరం

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు టౌన్: ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడ అయిన పటాన్‌చెరుకు మెట్రో రైలు రాక కోసం ప్రజలు ఎదురు చూశారని, వారి కల నెరవేరిందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్‌లో బీజేపీ శ్రేణులు నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ప్రయత్నాలు జరిగినప్పటికీ, తాను ఎంపీగా పోటీ చేస్తున్న సమయంలో అమీన్‌పూర్‌లో మెట్రో కోసం ఫ్లెక్సీలు పెట్టారని తెలిపారు. పటాన్‌చెరు వరకూ 14.5 కిలో మీటర్లు త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రధాని మోడీ నాయకత్వంతో మౌలిక వసతుల కోసం పక్కాగా పని చేస్తామని వివరించారు. బీహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి సంగారెడ్డి వరకూ నిర్మించే ఆరు లేన్ల జాతీయ రహదారిని ప్రారంభించేందుకు జనవరిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి రానున్నట్లు పేర్కొన్నారు. మౌలిక వసతులు, అభివృద్ధితో అనేక రకాలుగా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగసాని నరేష్, ముదిరాజ్, శ్రీనివాస్ గుప్తా, ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు చేర్చాలి

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు

కంది(సంగారెడ్డి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు చేర్చి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. ఆదివారం కంది మండలంలోని ఆరుట్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ప్రతీ రోజు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు పంపాలన్నారు. అవసరమైన గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద తాగు నీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. తేమ శాతం 17 లోపు ఉన్నప్పుడే తూకం వేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉల్లి ఘాటు తగ్గింది

జహీరాబాద్ టౌన్: ఉల్లి ఘాటు కాస్త తగ్గింది. జహీరాబాద్ మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి ఉల్లి లోడులు వస్తున్నాయి. దీంతో ఇప్పుడిప్పుడే ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. నెల రోజుల క్రితం వరకు మహారాష్ట్ర ఉల్లి కేజీ రూ. 60 వరకు ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ. 25 వరకు పలుకుతుంది. నెల రోజుల వరకు ప్రజలను ఉల్లి ఉక్కిరి బిక్కిరి చేసింది. కానీ ప్రస్తుతం ధర దిగిరావడంతో సామాన్య ప్రజలకు ఊరట లభించింది. టమాట ధర సైతం దిగివస్తుంది. చాలా రోజుల వరకు టమాట కేజీ రూ. 50 తగ్గలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ. 30కు విక్రయిస్తున్నారు.



జహీరాబాద్ మార్కెట్‌లో ఉల్లి విక్రయం

ఏడుపాయలలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోనాలు తీస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దిగొచ్చిన మిల్లర్లు

అండర్ టేకింగ్ ఇచ్చేందుకు సుముఖత

- బ్యాంకు గ్యారంటీ ముఖ్యం కాదన్న అధికారులు
- ధాన్యం దింపుకోవాలని ఒత్తిడి
- నేటి నుంచి ప్రారంభం కానున్న కొనుగోళ్లు

ఎట్టకేలకు మిల్లర్లు దిగొచ్చారు. సోమవారం అండర్ టేకింగ్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. వానాకాలం ధాన్యం మిల్లింగ్‌పై 20 రోజులుగా రైస్ మిల్లర్లు, అధికారులకు మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు విఫలం కాగా ఆదివారం సఫలమయ్యాయి. ఇక కొనుగోళ్లకు అడ్డంకులు తొలగిపోగా, జిల్లాలో ధాన్యం తూకం ప్రారంభం కానుంది.

– మెదక్‌జోన్

మెదక్ జిల్లాలో బాయిల్డ్, రా రైస్ మిల్లులు మొత్తం 104 ఉండగా, వాటిలో 60 మిల్లులు ప్రభుత్వానికి బకాయిపడ్డాయి. వాటికి ధాన్యం ఇవ్వమని, మిగితా 44 మిల్లులకు మాత్రమే ఇస్తామని అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా గత ప్రభుత్వం రైస్‌మిల్లుల కెపాసిటీకి మించి ధాన్యం కేటాయించడంతో సకాలంలో ధాన్యాన్ని మరాడించలేక పోయామని, కాస్త ఆలస్యంగా బియ్యం ఇచ్చిన మిల్లులకు సైతం 25 శాతం జరిమానా విధించారని మిల్లర్లు వాపోయారు. దానిని రద్దు చేయాలని, అలాగే దొడ్డు ధాన్యం మాదిరిగా సన్నాలు క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం ఎట్టి పరిస్థితుల్లో రావని స్పష్టం చేశారు. సన్నధాన్యం క్వింటాల్‌కు 55 కిలోల బియ్యంతో పాటు 8 కిలోల నూకలతో కలిపి మొత్తం 63 కిలోలు వస్తాయని ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఇది ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) పరిధిలో అంశమని, ఆ నిబంధనలో ఎలాంటి మార్పులు ఉండవని సివిల్ సప్‌లై అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బ్యాంకు గ్యారంటీ ముఖ్యం కాదని, ధాన్యం దింపుకోవాలని ఒత్తిడి చేశారు. ఫలానా సమయానికి బ్యా ంకు గ్యారంటీ ఇస్తామని, అప్పటివరకు అండర్ టేకి ంగ్ ఇస్తే సరిపోతుందని చెప్పడంతో మిల్లర్లు ధాన్యం దింపుకోవడానికి అంగీకరించినట్లు తెలిసింది.



మెదక్ మండలం రాజ్‌పల్లి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

పెరగనున్న మరో 10 మిల్లులు

జిల్లాలో 104 మిల్లులకు గానూ 60 మిల్లులపై పలు రకాల కేసులు నమోదు కావడంతో మిగితా 44 మిల్లులకు మాత్రమే ధాన్యం ఇస్తామని సివిల్ సప్‌లై అధికారులు ప్రకటించారు. కాగా 2021–22లో వాటిలో ఆరుగురు మిల్లర్లు సకాలంలో బియ్యం ఇచ్చినప్పటికీ, అప్పటి అధికారుల తప్పిదంతో ఆలస్యంగా ఇచ్చారని రికార్డుల్లో పొందుపర్చారు. వారు ఈ విషయం సివిల్ సప్‌లై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, వాటికి మినహాయింపు ఇంచే అవకాశం ఉంది. అలాగే జిల్లాలో నూతనంగా మరో 4 రైస్‌మిల్లుల నిర్వాహకులు తమకు ధాన్యం ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నట్లు తెలిసింది. ఈ లెక్కన మరో పది మిల్లులు పెరగగా, మొత్తం 54 రైస్ మిల్లులకు ధాన్యం ఇవ్వనున్నారు.

లక్ష మెట్రిక్ టన్నులు..

కాగా కొనుగోలు కేంద్రాలకు గత 20 రోజుల నుంచే ధాన్యం పెద్ద ఎత్తున వచ్చింది. తూకం ప్రారంభించకపోవడం, తరచూ వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు చేసేదిలేక ఇప్పటికే సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులకు విక్రయించారు. దొడ్డు ధాన్యం క్వింటాల్‌కు రూ. 1,900 నుంచి రూ. 2 వేల వరకు విక్రయించగా, సన్నధాన్యం రూ. 2,200 చొప్పున విక్రయించారు. కాగా ఈ ఏడాది దొడ్డు, సన్నరకం కలిపి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా లక్ష మెట్రిక్ టన్నులు పోగా ఇక మిగిలింది 3 లక్షల మెట్రిక్ టన్నులే.

మిల్లర్లు ఒప్పుకున్నారు

అండర్ టేకింగ్ ఇచ్చేందుకు మిల్లర్లు ఒప్పుకున్నారు. ఇక సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు భయపడాల్సిన అవసరం లేదు. మిల్లర్లతో జరిపిన చర్చల కారణంగా కాస్త ఆలస్యం జరిగింది.

– హరికృష్ణ, సివిల్ సప్లై డీఎం, మెదక్

క్లుప్తంగా

సైక్లింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కోచ్ యాదగిరి

రామాయంపేట(మెదక్): జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు రామాయంపేటలో ఆదివారం నిర్వహించారు. కోచ్ దండు యాదగిరి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందులో ఎంపికైనవారు 6న జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టణ శివారులోని హైవే బ్రిడ్జి వద్ద నిర్వహించిన పోటీల్లో 14, 16 ఏళ్లలోపు క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న..

కుమారుడు, తల్లిదండ్రులు రిమాండ్

నర్సాపూర్: ఎండు గంజాయి అమ్ముతున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన కూనపులి వికాస్, అతడి తండ్రి కూనపులి రమేశ్, తల్లి కూనపులి రస్వతి గత నెల 29న నర్సాపూర్‌లోని శివాలయం ఏరియాలో గంజాయి విక్రయించేందుకు వెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు వారిని పట్టుకొని రూ.2వేలు విలువ చేసే 94 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నాం. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

తేనెటీగల దాడిలో గొర్రెల కాపరి మృతి



బాలయ్య (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్) : తేనెటీగల దాడిలో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లికి చెందిన బోకర్ల బాలయ్య(45) అనే వ్యక్తి గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం పది గంటల సమయంలో జీవాల మేత కోసం ఓ వ్యవసాయ బావి వద్ద చెట్టు కొమ్మలు తెంపుతుండగా అకస్మాత్తుగా తేనెటీగలు గుంపు చుట్టుముట్టాయి. బాలయ్య పరుగులు పెట్టి గ్రామంలోని ఇంటిలోకి దూరినప్పటికి తేనెటీగలు వదలలేదు. గ్రామస్తులు పొగ పెట్టి తేనెటీగలు వెళ్లిపోయేలా చేశారు. అయితే అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తండ్రీ కొడుకులపై కత్తితో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్

వట్‌పల్లి(అందోల్): తండ్రీకొడుకులపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని అల్మాయిపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ పాండు కథనం మేరకు.. కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామానికి చెందిన బత్తిని నగేశ్ శనివారం బంధువైన అందోలు మండలంలోని అల్మాయిపేట గ్రామానికి చెందిన బత్తిని ఆగమయ్య ఇంటికి వచ్చాడు. తాను ఓ పని నిమిత్తం జోగిపేటకు వచ్చానని పని ముగిసేసరికి చీకటి పడటంతో ఇక్కడికి వచ్చానని చెప్పాడు. రాత్రి అందరూ భోజనం చేసిన తర్వాత ఆగమయ్య, నగేశ్ ఒకచోట పడుకోగా ఆగమయ్య కుమారుడు వెంకట్ తల్లితో కలిసి మరో గదిలో నిద్రించారు. ఒంటి గంట ప్రాంతంలో నగేశ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆగమయ్యపై దాడి చేశాడు. కుమారుడు వెంకట్ వచ్చి నగేశ్‌ను ఆపే ప్రయత్నం చేయగా అతడిపై దాడి చేసి నగేశ్ పారిపోయాడు. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు ఆగమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నగేశ్, ఆగమయ్యకు రెండు నెలల కిందట ఓ ఫంక్షన్‌లో గొడవ జరుగగా ఇదే విషయంపై కక్ష పెంచుకొని నగేశ్ హత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు చెబుతున్నారు

బండరాయితో మోది.. ఆపై నిప్పు పెట్టి

- యువకుడి దారుణ హత్య
- పది రోజుల వ్యవధిలో ఇదే తరహాలో ఇద్దరు
- ఆనవాళ్లు దొరక్కుండా తగులబెడుతున్న ఆగంతకులు
- పోలీసులకు సవాల్‌గా మారిన కేసులు
- చిన్నశంకరంపేటలో కలకలం



డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తు తెలియని యువకుడిని బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని మెదక్–చేగుంట రహదారిపై ఉన్న పద్మనాభస్వామి గుట్ట బస్టాండ్ ఆవరణలో సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు. అనంతరం ఆనవాళ్లు దొరక్కుండా నిప్పుపెట్టి కాల్చివేశారు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించారు. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజం గౌడ్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మెదక్ క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. డాగ్‌స్క్వాడ్ తీసుకు రాగా అయ్యప్పస్వామి దేవాలయం పక్కన ఉన్న ఇంటి వద్దకు వెళ్లి తిరిగి వచ్చాయి. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

అసలేం జరుగుతోంది..

చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పది రోజుల వ్యవధిలో ఒకే తరహాలో రెండు హత్యలు జరగడం కలకలం రేపుతోంది. గత నెల 23న రాత్రి ప్రభుత్వాస్పత్రి వెనుక వరండాపై యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని తగులబెట్టారు. మళ్లీ అదే తరహాలో హత్య జరగడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నిందితులు సైతం భయానకంగా హత్య చేసి ఆనవాళ్లు దొరక్కుండా మృతదేహాలను తగులబెడుతున్నారు. ఈ రెండు హత్యలు కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరగడం సంచలనం సృష్టిస్తుంది. ఒకే తరహా హత్యలు కావడంతో పోలీసులకు సవాల్‌గా మారింది.

త్వరలోనే పట్టుకుంటాం

వరుస హత్యలకు కారణమైన హంతకుడిని త్వరలోనే పట్టుకుంటాం. మొదటి హత్యకు సంబంధించిన సీసీ ఫుటేజీ ఇప్పటికే సేకరించి విచారణ జరుపుతున్నాం. హత్యకు గురైన వ్యక్తితో వెళ్లిన మరో వ్యక్తి సీసీ ఫుటేజీ సేకరించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. రెండో కేసును కూడా సీసీ ఫుటేజీలు సేకరించి ఛేదిస్తాం. గుర్తు తెలియని వ్యక్తులు సంచారం, రాత్రి సమయంలో ఒంటరిగా తిరిగే వ్యక్తుల గురించి స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించాలి.

ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

నిందితులెవరు?

వరుస హత్యల్లో హంతకుడెవరనేది తెలియని పరిస్థితి నెలకొంది. చిన్నశంకరంపేటలో పలు పరిశ్రమలు ఉండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఎక్కువయ్యారు. ఇక్కడే కంపెనీల్లో పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఇందులో కుటుంబాలతో కలిసి ఉండేవారు కొందరైతే, బ్యాచిలర్స్‌గా ఎక్కువ మంది కార్మికులు ఉంటున్నారు. రెండు హత్య కేసుల్లో మృతి చెందిన వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 53 కేసులు నమోదు



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 53 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులు 53 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. అదే విధంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన మరో 10 మంది వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణ నివారించడం గురించి జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, హుస్నాబాద్, చేర్యాల సీఐలు శ్రీనివాస్, ఎస్‌లు నరసింహారావు, అపూర్వరెడ్డి, వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మాసాగర్‌లో షూటింగ్ సందడి



సినిమాలో నటీనటులు సాంకేతిక వర్గం



హీరో హీరోయిన్ సన్నివేశంపై క్లాప్ కొడుతున్న డైరెక్టర్ రవికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో కొత్త నటీనటులతో వైఫ్ ఆఫ్ రామకృష్ణ సినిమా షూటింగ్‌ను ఆదివారం ప్రాంరభించారు. గ్రామ నాయకుడు తిరుపతిరెడ్డి ఇంట్లో పురోహితులు సుమన్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హీరో అరుణ్, హీరోయిన్ పల్లవి బుట్టబొమ్మపై డైరెక్టర్ రవికుమార్ నీల క్లాప్‌కొట్టగా, కో ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రవికుమార్ నీల మాట్లాడుతూ.. ప్రేమ, ఎమోషన్‌తో కూడిన సందేశాత్మక చిత్రంగా వైఫ్ ఆఫ్ రామకృష్ణను తీస్తున్నట్లు చెప్పారు. ధర్మాసాగర్‌తోపాటు పరిసర ప్రాంతాలలో నెలరోజులపాటు షూటింగ్ చేస్తామన్నారు. కో ఆర్డినేటర్‌గా తిరుపతిరెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్‌గా ప్రమోద్, కెమెరామ్యాన్ అనిల్, ఎగ్జిక్యూటర్‌గా వీరేశ్‌గౌడ్, ఆర్టిస్టులు సంతోష్‌గౌడ్, అశోక్‌గౌడ్, తదితరులు నటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మర్రి శ్రీనివాస్, రాజుగౌడ్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా..

- నగదు, నిత్యావసర సరుకులు అందజేత
- దాతృత్వం చాటుకున్న కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ 1995–96 బ్యాచ్ విద్యార్థులు



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పూర్వవిద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: అనాథల ఇబ్బందులు తెలుసుకున్న ఓ మిత్రబృందం వారికి అండగా నిలిచింది. నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి దాతృత్వం చాటుకుంది. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1995–96లో పదో తరగతి చదవిన విద్యార్థులు సోషల్ మీడియాలో హయత్‌నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్ విద్యార్థుల బాధలను తెలుసుకున్నారు. దీంతో వారు సాయం చేయాలని నిర్ణయించుకొని నగదుతోపాటుగా బియ్యం, పప్పులు, వంట నూనె అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌లోని 125 మంది విద్యార్థులతో మాట్లాడారు. క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

సినిమాకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

- 24 తులాల బంగారం, రూ.5 వేలు నగదు చోరీ



పటాన్‌చెరు టౌన్: ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లి ఇంటికొచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూర్ లైఫ్ స్టైల్‌లో నివాసం ఉంటున్న శరత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లి తిరిగి ఆదివారం తెల్లవారుజామున ఇంటికొచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో లోనికి వెళ్లి చూడగా 24 తులాల బంగారం, రూ.5 వేల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ క్లూస్ టీమ్‌తో పాటు అదనపు ఎస్పీ సంజీవ్, డీఎస్పీ రవీందర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చోరీ సొత్తు స్వాధీనం

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల పెద్దశంకరంపేటలో కానిస్టేబుల్ సీమన్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఆదివారం అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సీమన్ ఇంట్లో దొంగలు పడి ఎనిమిదిన్నర తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన కాశీరాం, నిర్మలతోపాటు కామారెడ్డి జిల్లాకి చెందిన వడ్డె శ్రీకాంత్‌ను పట్టుకున్నారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చంద్రకళ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రాపురం పట్టణంలోని సాయికాలనీకి చెందిన చంద్రకళ(50) భారతీనగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో నివాసం ఉండే బంధువుల వద్దకు వచ్చింది. ఆదివారం ఉదయం ఇంటికెళ్లేందుకు రామచంద్రాపురం పట్టణంలోని డైమండ్ హోటల్ సమీపంలో జాతీయరహదారి దాటుతుంది. ఇదే సమయంలో బైక్‌పై ఓ యువకుడు అతివేగంగా వచ్చి చంద్రకళను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బైక్ నడిపిన వ్యక్తి పటాన్‌చెరు మండలం అంబేడ్కర్ కాలనీకి చెందిన షేక్ షఫీగా పోలీసులు గుర్తించారు. మృతురాలి కుమారుడు భార్గవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



పద్మ మృతదేహం

సిద్దిపేటకమాన్: చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన బెల్ల పద్మ (40) ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తుంది. భర్త మృతి చెందగా కుమారుడితో కలిసి సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటుంది. పద్మ స్థానిక నర్సాపూర్ చెరువులో దూకి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మహిళ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ఇంకా ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ మోసం

రూ.6.39 లక్షలు పోగొట్టుకున్న యువతి

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ యువతి భారీగా నగదు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సిటీజన్ కాలనీకి చెందిన ఓ యువతికి అక్టోబర్ 18 వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె తన వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా రూ.6.39 లక్షలు చెల్లించింది. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వర్గీకరణ అమలులో సీఎం రేవంత్ నిర్లక్ష్యం

- భవిష్యత్ పోరాటానికి సన్నద్ధం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

సిద్దిపేటజోన్: ఎస్సీ వర్గీకరణ అమలు లక్ష్యంగా పోరాటానికి మాదిగ జాతి సన్నద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన మాదిగల ధర్మ యుద్ధ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ మాలలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకు నాటి పార్టీ అధ్యక్ష పదవిని సంజీవయ్యకు తిరిగి నేడు ఖర్గేకు ఇవ్వడం నిదర్శనమని పేర్కొన్నారు. వర్గీకరణకు సానుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో ఉద్యోగాల నియామకాలు, విద్యా సంస్థలలో ప్రవేశాలు తదితర అంశాల్లో అమలు కావడం లేదన్నారు. వర్గీకరణ అమలు చేయకుండానే టీచర్ల పోస్టులు భర్తీ చేశారని, దీంతో మాదిగలకు తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. వర్గీకరణ అమలు కోసం మళ్లీ రోడ్డెక్కే పరిస్థితి వ చ్చిందని. మాదిగలంతా కుటుంబంతో సహా ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. అతిత్వరలో పోరాట ప్రణాళికను రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, విజయ్ కుమార్, పర్శరాములు,ఇస్తరి, యాదగిరి, ప్రసాద్, అబ్రహం , గీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనకు ఆటంకం ఉండొద్దు

- తపస్ రాష్ట్ర కార్యదర్శి సింగోజు జనార్దన్



సమావేశంలో తపస్ కార్యవర్గ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనకు తమ మద్దతు తెలియజేస్తున్నామని, కానీ ఆ కులగణన చేసే విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని తపస్ రాష్ట్ర కార్యదర్శి సింగోజు జనార్దన్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్మాగ్రహ దీక్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రమే సర్వే విధులను అప్పగించడం సరికాదన్నారు. అందరూ ఉపాధ్యాయులకు సర్వే విధులను కేటాయించి తక్కువ సమయంలో కుల గణన పూర్తి చేయాలనడం ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడమే అన్నారు. సర్వే మధ్యాహ్నం పూట నిర్వహించాలని చెప్పడం సరి కాదని, ఆ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు ఎవరూ అందుబాటులో ఉండరన్నారు. కుల గణనను అనుకూల సమయంలో నిర్వహిస్తూ, విద్యాబోధనకు ఏ విధమైన ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్, జిల్లా బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అత్తనే హంతకురాలు..

- వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- మద్యం తాగి కూతురిని, పిల్లలను వేధిస్తున్నాడని ఘాతుకం



నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐలు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులో అంత్వార్ రోడ్డులో నాలుగు రోజుల కింద దారుణ హత్యకు గురైన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు ప్రధాన నిందితురాలు అత్తనే అని తేల్చారు. నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని ర్యాలమడుగుకు చెందిన దొంతి మహేశ్(32)కు పదేళ్ల కిందట ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. మహేశ్ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా భార్యను కొట్టేవాడు. తండ్రి చనిపోతే వచ్చిన రైతు బీమా డబ్బులు జల్సాలకు ఖర్చుచేశాడు. ఉన్న రెండెకరాల భూమిని అమ్మడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. కూతురిని చిత్రహింసలు పెడుతూ సంసారాన్ని ఆగం చేస్తూ, భూమిని అమ్మేసి ఖర్చు చేస్తే పిల్లలకు ఎలాంటి ఆసరా ఉండదని అల్లుడిని ఎలాగైనా చంపేస్తే భూమైనా మిగులుతుందని అత్త వీరమణి నిర్ణయించింది. పది రోజుల కిందట మహేశ్ భార్యతో గొడవపడి చిన్నకూతురిని వేడి నీళ్లల్లో పడేయడంతో ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. గత నెల 30న మహేశ్ ఆస్పత్రికి వచ్చాడు. అక్కడే ఉన్న అత్త వీరమణి పథకం ప్రకారం.. ఆమెకు తెలిసిన ఖేడ్ మండలం నర్సాపూర్‌కు చెందిన కిష్టయ్యను పిలిపించింది. ఇద్దరూ కలిసి అంత్వార్ రోడ్డులోని జూకల్ శివారులో ఖాళీ స్థలానికి మహేశ్‌ను తీసుకెళ్లి మద్యం తాగించారు. అనంతరం మహేశ్ గొంతుకు ప్లాస్టిక్ తాడు బిగించి ఊపిరి ఆడకుండా చేశారు. ఇంకా ప్రాణం పోలేదని నిర్ధారించుకుని బండరాయితో తీవ్రంగా కొట్టి హత్యచేశారు. కేసు విచారణలో భాగంగా నిందితులైన వీరమణి, కిష్టయ్య అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్ల సీఐ, ఎస్ఐ వివరించారు.

నిరుపేద ఆర్యవైశ్యులకు సహకారం

- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సుజాత



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుజాత

సంగారెడ్డి టౌన్ : ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుపేద వైశ్యులకు సహకారం అందిస్తామని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్సన్ సుజాత అన్నారు. సంగారెడ్డిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పోరాటం చేసినా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కార్పొరేషన్ కోసం తాను ముందుండి పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇవ్వకుండా మొదటిసారి ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. టీజీ ఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులకు తాను ఎప్పటికీ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమానికి తాను హాజరు కావడం అదృశ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఆర్యవైశ్యులకు గర్వకారణమని తెలిపారు. నూతన కార్యవర్గానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదంశెట్టి పూర్ణచందర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కన్నీటి సంద్రంలో పోతారం

- రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు పూర్తి
- బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బాధితులను ఓదారుస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్):మండలంలోని పోతారం గ్రామం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. శుభకార్యానికి వెళ్తూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు శనివారంవారం ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. తూప్రాన్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు ఆదివారం పోతారం గ్రామానికి చేరుకోవడంతో కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. అలాగే మృతుల కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టగా వారికి న్యాయం చేస్తామని ట్రాక్టర్ యజమాని, తాజా మాజీ సర్పంచ్ మాధవరెడ్డి హామీనివ్వడంతో అంత్యక్రియలు చేశారు. ఘటన విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు వేర్వేరుగా సందర్శించి బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

భార్యను, కూతుళ్లను కోల్పోయి..

గ్రామానికి చెందిన మన్నె కుమార్, లావణ్య దంపతులకు సంజన, సహస్ర, శాన్విలు ముగ్గురు కుమార్తెలున్నారు. ఈ ప్రమాదంలో లావణ్యతోపాటు ఇద్దరు కుమార్తెలు చనిపోయారు. ఉన్న ఒక్క కూతురు సంజనను చూస్తూ కుమార్ రోదించిన తీరు అక్కడున్న ఉన్నవారిని కంటతడి పెట్టించాయి. అలాగే మృతుడు మన్నే ఆంజనేయులుకు భార్య సుజాత, కూతురు భానుప్రియ ఉంది. ఈయన మృతితో ఇద్దరు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. తండ్రికి కూతురు భానుప్రియ తలకొరివిపెట్టింది.